నేడు యథావిధిగా 'పిజిఆర్ఎస్'

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించుకోవచ్చని తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

'అపరాల' అగచాట్లు..!

జాలిపూడిలో పెసర పంటను ఆరబెడుతున్న రైతులు

ధర లేక, దిగుబడి రాక రైతుల ఆవేదన

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై తీవ్ర నిర్లక్ష్యం

ప్రకటనలతో సరిపెడుతున్న అధికారులు

పెసర క్వింటాకు దాదాపు రూ.1,480

నష్టపోతున్న అన్నదాత

రైతులను దోచేస్తున్న దళారులు

దిగుబడి తగ్గడంతో పెట్టుబడి ఖర్చులు రాని దుస్థితి

ప్రభుత్వం, అధికారుల తీరుపై విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వంలో అన్నదాతకు భరోసా లేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెసర, మినుము వంటి అపరాల సాగుచేసిన రైతులకు సరైన ధర దక్కక నష్టాలను చవిచూస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అధికారుల ప్రకటనలతో సరిపెట్టడం తప్ప ఆచరణలో ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. దీంతో ముఖ్యంగా పెసర రైతులు తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితి నెలకొంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందేలా చూడాలంటూ అపరాల రైతులు వేడుకుంటున్న పరిస్థితి ఏర్పడింది. పెదపాడు, ఏలూరు, దెందులూరు, ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు, కలిదిండి వంటి మండలాల్లో రైతులు పెద్ద ఎత్తున అపరాల సాగుచేపట్టారు. మిగిలిన ప్రాంతాల్లోనూ అపరాల పంటను రైతులు సాగు చేశారు. ఏలూరు జిల్లాలో 15,847 ఎకరాల్లో పెసర పంట, 23,437 ఎకరాల్లో మినుము పంటతోపాటు కందులు వంటి ఇతర అపరాల పంటలను దాదాపు 40 వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఈ ఏడాది చీడ పీడల నుంచి అపరాల పంటను కాపాడుకునేందుకు రైతులు గతంలో ఎన్నడూలేని విధంగా కష్టపడాల్సి వచ్చింది. రూ.వేలకు వేలు వెచ్చించి ఐదారు సార్లు పురుగుమందులు పిచికారీ చేయాల్సి వచ్చింది. ఇంత చేసినా దిగుబడి రాని పరిస్థితి నెలకొంది. ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి కాస్తా రెండు, రెండున్నర క్వింటాళ్లు దాడడం లేదు. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒక్కపక్క దిగుబడి తగ్గిపోగా, మరోపక్క పండిన పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కకపోవడం రైతులను మరిన్ని కష్టాల్లోకి నెట్టేస్తోంది.

మద్దతు ధర కోసం ఎదురుచూపులు

అపరాల పంటల మాసూలు దాదాపు 90శాతంపైగా పూర్తయ్యాయి. పంట రైతుల వద్దే ఉంది. పెసరకు క్వింటాకు రూ.8,682 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. దళారులు మాత్రం క్వింటాకు రూ.7,200 మాత్రమే ఇస్తున్నారు. దీంతో క్వింటాకు రూ.1480 వరకూ రైతులు నష్టపోతున్నారు. ఎకరాకు రెండున్నర క్వింటాళ్ల దిగుబడి లెక్కించినా రైతులు ఎకరాకు రూ.3,700 వరకూ నష్టపోతున్న పరిస్థితి నెలకొంది. ఐదెకరాల పెసర సాగుచేసిన రైతులు మద్దతు ధర దక్కక రూ.18,500 వరకూ నష్టపోతున్నారు. దీంతో రైతులు పండిన పంటను విక్రయించకుండా కళ్లాల్లోనే ఉంచారు. మినుము పంట విషయంలో కొంత పర్వాలేదనిపించినా పెసర రైతులు మాత్రం తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఎకరాకు రూ.25 వేల వరకూ పెట్టుబడి పెట్టామని, ఒక పక్క దిగుబడి రాక, మరోపక్క సరైన ధరలేక తీవ్రంగా నష్టపోతున్నానని రైతులు గగ్గోలుపెడుతున్నారు. అపరాల రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఈ నెల ఏడో తేదీన జిల్లా అధికారులు ప్రకటించారు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా కొనసాగుతోంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు జరగలేదు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే మద్దతు ధర దక్కుతోంది

వాసంశెట్టి నాగరాజు, పెసర రైతు, కాట్లంపూడి

'ఆరెకరాల్లో పెసర పంటసాగు చేశాను. రెండెకరాల్లో మాసూలు చేశాను. మిగిలిన పంట మాసూలు చేస్తున్నాను. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో వ్యాపారులు క్వింటా రూ7,300లకు మాత్రమే కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. ఎకరాకు ఐదు టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా రెండున్నర టన్నులే వస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర వస్తే క్వింటాకు రూ.8,682 వరకూ వస్తోంది. పెట్టుబడి ఎకరాకు రూ.25 వేలు వరకూ ఖర్చయ్యింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర దక్కేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

దిగుబడి లేదు..మద్దతు ధర దక్కడంలేదు

శ్రీకృష్ణ, పెసర రైతు, జాలిపూడి

'ఏడెకరాల్లో పెసర సాగుచేశాను. మాసూలు చేసిన పంట అలానే ఉంది. వ్యాపారులు క్వింటాకు రూ.7,200 నుంచి రూ.7,300 వరకూ మాత్రమే ధర ఇస్తామంటున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే మద్దతు ధర దక్కే అవకాశం ఉంటుందని ఎదురుచూస్తున్నాం. ఎకరాకు రెండున్నర క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తోంది. మద్దతు ధర దక్కపోతే తీవ్రంగా నష్టపోతాం.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి

కె.శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

అపరాల పంటల ధరలు బాగా పడిపోయాయి. ఆలస్యం చేయకుండా వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రకటనలతో సరిపెట్టడం కాదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి. దిగుబడులు రాక, ధరలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

మాట్లాడుతున్న ఆర్.మణిసింగ్

యశ్వంత్ మృతిపై సిబిసిఐడి దర్యాప్తు చేయాలి

ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బాలుడు యశ్వంత్ మృతిపై సిబిసిఐడి దర్యాప్తు చేయాలని ఆదివారం జరిగిన ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. ఏలూరులోని అన్నే భవనంలో ఆదివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి భారతీయ బౌద్ధ మహాసభ ఛైర్మన్ ఆర్.మణిసింగ్ అధ్యక్షత వహించి మాట్లాడారు. దళితులకు చట్టాలపై ప్రభుత్వాలు, అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, తద్వారా మృతుల కుటుంబ సభ్యులు ప్రలోభాలకు గురికాకుండా ఉంటారని అన్నారు. కెవిపిఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి మృతి చెందినప్పుడు సుప్రీంకోర్టు గైడెన్స్ ప్రకారం చనిపోయిన స్థలంలోనే పంచనామా నిర్వహించాలని, అక్కడే సాక్షి సంతకాలు తీసుకోవాలని, కానీ యశ్వంత్ మృతి కేసులో అలాంటి నిబంధనలు పాటించలేదని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోనే ఇలాంటి ఘటనలు జరగడం, మధ్యవర్తులు మృతుని కుటుంబ సభ్యులను ప్రలోభాలకు గురి చేయటం సిగ్గుచేటని విమర్శించారు. ఈ విషయంపై న్యాయస్థానాలు సుమోటోగా కేసు నమోదు చేయాలని, ప్రభుత్వం సిబిసిఐడి దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఎపి మహిళా సంఘం జిల్లా కార్యదర్శి శ్యామల రాణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు కె.విజయలక్ష్మి, నేతలు మంచెం ఇస్సాక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, ఐలు సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు బాలరాజు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి పేదలకు వరం

మంత్రి కొలుసు పార్థి సారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అనారోగ్యాల పాలై ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేని పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం వంటిదని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు పార్టీ కార్యాలయంలో 90 మంది లబ్ధిదారులకు రూ.65.54 లక్షల విలువైన సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ నిరుపేదల అభివృద్ధే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని తెలిపారు. ఆపదలో ఉన్న ఎన్నో కుటుంబాలను సిఎం సహాయ నిధి ఆదుకుంటోందన్నారు. బాధితులు అవసరమైన సమయంలో సిఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. దేశంలోనే తొలిసారి రాష్ట్రంలో వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని, మొదటి విడతలో 161 సేవలను వాట్సప్ ద్వారా అందించనున్నారని తెలిపారు. ఈ తొలి విడతలో సిఎంఆర్ఎఫ్, దేవాదాయ, విద్యుత్ శాఖ, ఆర్‌టిసి, రెవెన్యూ, అన్నా క్యాంటీన్, మున్సిపల్ శాఖలలోని సేవలను చేరవేస్తోందని వ్యాఖ్యానించారు. నియోజవర్గ వ్యాప్తంగా ప్రజలు ప్రమాదాలకు గురైన, అనారోగ్యాలపాలై ఆసుపత్రుల్లో చేరిన తమకు సమాచారం ఇవ్వాలని విన్నవించారు.

చెక్కులు అందజేస్తున్న మంత్రి పార్థసారథి

నూజివీడు ఆర్‌జియుకెటిలో ఎఐ, రోబోటిక్స్ హ్యాకథాన్లు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో టెక్‌జైట్-25లో భాగంగా ఎఐ, రోబోటిక్స్ హ్యాకథాన్లు నిర్వహిస్తున్నారు. ఐటిఇఎం, ఎన్ఆర్ఐ శారద, లక్కీరెడ్డి బాలరెడ్డి వంటి 13 కాలేజీల నుంచి ఎఐ హ్యాకథాన్‌లో 71 జట్లు, రోబోటిక్స్ హ్యాకథాన్‌లో పది జట్లు పాల్గొన్నాయి. ఈ హ్యాకథాన్‌లను ముందుకు తీసుకెళ్లేందుకు అస్పైర్ ఎఐ ల్యాబ్స్, అమోషన్ ఎఐ సంస్థలు ఎఐ హ్యాకథాన్‌కు స్పాన్సర్ చేయగా, రోబోటిక్స్ హ్యాకథాన్‌కు ఇగ్నైటెడ్ మైండ్స్ సంస్థ మద్దతు అందించింది. అకడమిక్ బ్లాక్-2లో ఈ హ్యాకథాన్ ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా డైరెక్టర్ అమరేంద్రకుమార్, ఎఒ లక్ష్మణరావు, డీన్ ఆఫ్ అకాడమిక్స్, టెక్‌జైట్ కన్వీనర్ చిరంజీవి పాల్గొన్నారు. ఎఐ హ్యాకథాన్‌లో భాగంగా 71 జట్లకు రెండు సమస్య ప్రకటనలు అందించగా ఉత్తమ పరిష్కారం కనుగొన్న రెండు జట్లకు ఒక్కో జట్టుకు రూ.పది వేలు బహుమతి ఇవ్వనున్నారు. రోబోటిక్స్ హ్యాకథాన్‌లో పది జట్లకు ఒక సమస్య ప్రకటనను అందించి దానికి ఉత్తమ పరిష్కారం కనుగొన్న జట్టుకు రూ.పది వేల బహుమతి ప్రకటించారు.

ఏప్రిల్ 30లోగా టిడ్కో ఇళ్లు ఇవ్వాలి

లేకుంటే పోరాటం తప్పదు

ప్రజా చైతన్య యాత్రలో

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

టిడ్కో ఇళ్ల వద్ద నినదిస్తున్న సిపిఎం నేతలు

లబ్ధిదారులకు ఏప్రిల్ 30వ తేదీలోగా టిడ్కో ఇళ్ల అప్పగించాలి, ప్రభుత్వం ఇళ్లు ఇవ్వకుంటే మే 30వ తేదీ నాటికి లబ్ధిదారులందరినీ ఐక్యం చేసి ఇళ్లు స్వాధీనం చేసేందుకు పోరాటం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎం జంగారెడ్డిగూడెం పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా చైతన్య యాత్ర ఆదివారం జంగారెడ్డిగూడెంలోని మార్కండేయపురంలో సాగింది. ఈ కార్యక్రమం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రవి టిడ్కో ఇళ్లు కట్టిన ఏరియాలో పర్యటించి ప్రభుత్వం వాటిని కట్టిన విధానాన్ని అలాగే కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి తెచ్చిన ఇనుము, సిమెంటు ఇసుక, మెటల్, వాటర్ గొట్టాలు తదితర పాడైన మెటీరియల్‌ను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రవి మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అప్పగించకపోవడం ప్రజల పట్ల ప్రభుత్వాల చిన్న చూపే అని విమర్శించారు. సుమారు 864 కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో 2017 సంవత్సరంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారుల నుండి 25 వేల రూపాయల నుండి లక్షల రూపాయలు ప్రభుత్వం సేకరించి కోట్ల రూపాయలు టిడిపి ప్రభుత్వం దోచుకుందని తెలిపారు. వేలకోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఇళ్ల నిర్మాణం చేపట్టింది కానీ ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించకుండా 2019 ఎన్నికల్లో ఓట్లు వేస్తేనే ఈ ఇళ్లు ఇస్తామని వాగ్దానం చేసిందని ఎన్నికల్లో ఓడిపోయి అవమానాలపాలైందన్నారు. తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం చేపట్టి పేదలకు అప్పగించడంలో విఫలమైందని విమర్శించారు. మరలా తిరిగి ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తానని మాయ మాటలు చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా ఇప్పటివరకు టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పజెప్పలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే ఆయా లబ్ధిదారులకు ఏప్రిల్ నెలాఖరులోగా ఇళ్లు అప్పగించాలని, లేనిపక్షంలో మే నెలాఖరుకు సిపిఎం ఆధ్వర్యంలో బాధితులను ఐక్యం చేసి ఇళ్లను స్వాధీన పరుస్తామని ఆయన మున్సిపాల్టీ అధికారులను, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా సూపర్ సిక్స్ పథకాల అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మాటలకు పరిమితమవుతున్న పాలకులు, స్థానిక నాయకులు, మున్సిపాలిటీ అధికారులు కనీసం తాగునీరు, విద్యుత్, రోడ్ల సమస్యలను పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. స్థానిక ఎంఎల్ఎ పర్యటనలో లబ్ధిదారులు వారి సమస్యలు విన్నవించుకున్నప్పటికీ, ఎంఎల్ఎ హాస్యాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని బాధితులు వాపోయారని తెలిపారు. తక్షణం మార్కండేయపురం కాలనీలో సమస్యలు పరిష్కరించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు జి.సూర్యకిరణ్, ఎ.ప్రభాకరరావు, వై.సీత, టౌన్ కన్వీనర్ పసల సూర్యారావు, ఎస్ఎ.సుభాషిని, వంగ గోపి, ఎస్‌కె.మాబు సుభాని, కె.సుబ్బారావు, పి.సుబ్బారావు, బి.యశ్వంత్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 5,236 కేసుల పరిష్కారం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఏలూరు వారి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 8వ తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 26 బెంచీలు ఏర్పాటు చేశారు. వీటిలో ఏలూరులో ఆరు బెంచీలు, భీమవరంలో మూడు, కొవ్వూరులో మూడు, నరసాపురంలో మూడు, తణుకులో మూడు, తాడేపల్లిగూడెంలో మూడు, పాలకొల్లులో ఒకటి, నిడదవోలులో ఒకటి, జంగారెడ్డిగూడెంలో ఒకటి, చింతలపూడిలో ఒకటి, భీమడోలులో ఒకటి చొప్పున బెంచిలను ఏర్పాటు చేసినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్.ఎ.సి) ఎం.సునీల్‌కుమార్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా కేసులను రాజీ చేసినట్లు చెప్పారు. అందులో 5,236 కేసులను పరిష్కరించినట్లు వీటిలో 4,919 క్రిమినల్ కేసులు, 162 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. వీటిలో సుమారు రూ.11 కోట్లు పరిహారంగా కక్షిదారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. 155 సివిల్ కేసులను రాజీ అయ్యాయని, వీటితోపాటుగా 132 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. వీటిలో ఏలూరులో 1268, భీమవరంలో 896, చింతలపూడిలో 184, జంగారెడ్డిగూడెంలో 371, కొవ్వూరులో 300, నరసాపురంలో 292, పాలకొల్లులో 176, తాడేపల్లిగూడెంలో 495, తణుకులో 743, నిడదవోలులో 465, భీమడోలులో 46 కేసులు ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించామని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడినవారందరికీ సునీల్ కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

కొల్లేరు సమస్యను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా

ఎంపీ పుట్టా మహేష్ కుమార్

ప్రజాశక్తి - ఏలూరు రూరల్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎంపీ, ఎంఎల్ఎ

కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వీలుగా ఈ నెల పదో నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. రూరల్ మండలం గుడివాకలంకలో రూ.కోటి వ్యయంతో ఐదు ఎంవిఎ నుంచి ఎనిమిది ఎంవిఎ సామర్థ్యం పెంచిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఎంపీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొల్లేరు సమస్యను సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. వారి నుంచి సానుకూల స్పందన లభించిందని, అలాగే సమస్య తీవ్రతను పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సహకారం కోరనునట్లు ఎంపీ మహేష్ కుమార్ స్పష్టం చేశారు. ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంత ప్రజలకు తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

దెందులూరు : కాట్లంపూడిలో దీపక్ నెక్స్‌జెన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంటు, జాలిపూడిలో నిర్మించిన రజక సంఘం ఫంక్షన్ హాల్, బాబుఖాన్ గూడెంలో నిర్మించిన ఆలయ ప్రహరీ, తిమ్మారావుగూడెంలో ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంటును ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఎంపీ మహేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఎంపీ మాట్లాడారు. అనంతరం సామాజిక సేవలో భాగంగా గ్రామాల్లో అభివృద్ధికి బాటలు వేస్తున్న దీపక్ నెక్స్‌జెన్ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యాన్ని ఎంపీ మహేష్‌కుమార్ అభినందించారు.

ఏలూరు సిటీ : ఈ నెల 18, 19 తేదీల్లో ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం అనుబంధ బిసి మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగే ఆలిండియా బిసి మహిళా సెమినార్ వాల్‌పోస్టర్లను ఎంపీ మహేష్ కుమార్ ఏలూరు శాంతినగర్‌లోని తన కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్‌కుమార్ మాట్లాడుతూ చట్ట సభల్లో బిసిలకు కేటాయించిన 33 శాతం రిజర్వేషన్‌లో బిసి మహిళలకు 50 శాతం సబ్ కోటా కేటాయించాలనే విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గానరేష్ యాదవ్, బిసి మహిళ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భీమవరపు హేమ, యువజన విభాగం రాష్ట్ర కన్వీనర్ రంగు విక్రమ్ నాగు, ఏలూరు, ఎన్‌టిఆర్ జిల్లాల అధ్యక్షులు భీమవరపు సురేష్, పోతిన వరప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 14 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.11.62 లక్షల చెక్కులను ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ శాంతినగర్‌లోని తన కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో చికిత్స చేయించుకున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసా కల్పిస్తుందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.

అపరాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రైతు సంఘం ఆధ్వర్యంలో జాలిపూడిలో రైతుల నిరసన

ప్రజాశక్తి - దెందులూరు

నిరసన తెలుపుతున్న రైతులు

కనీస ధర రాక నష్టపోతున్నామంటూ అపరాల రైతులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. అపరాల కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలంటూ నినాదాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు అపరాల కొనుగోలు సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పెసర, మినుములు వంటి అపరాల పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసి అపరాల పంటలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రంగారావు, బైరెడ్డి లక్ష్మణరావు, తిరుపతి శ్రీకృష్ణ, కూడవల్లి హనుమంతు, గంగిరాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ప్రభుత్వ నిర్బంధాన్ని నిలిపివేయాలి

సిఐటియు జిల్లా కమిటీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం విజయవాడలో మహాధర్నా నిర్వహించతలపెట్టిన అంగన్వాడీలపై ప్రభుత్వ నిర్బంధాన్ని నిలిపివేయాలని సిఐటియు జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్వాడీలను విజయవాడ వెళ్లడానికి వీలులేదని అన్ని చోట్ల నోటీసులు ఇవ్వడం, బెదిరించడం మానుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల ముందు అంగన్వాడీల న్యాయమైన సమస్యలపై 42 రోజుల నిరవధిక సమ్మె చేపట్టిన సందర్భంగా అంగన్వాడీలకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన టిడిపి అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు వారి సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేయడం అన్యాయమని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు మద్దతు తెలిపి అధికారంలోకొచ్చాక అవకాశవాదంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సమ్మె సందర్భంగా సాధించుకున్న రిటైర్‌మెంట్ బెనిఫిట్‌ను ఇప్పుడు చంద్రబాబు నాయుడు గ్రాడ్యూటీగా ఇస్తున్నట్లు మోసపూరిత జిఒలు జారీ చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.

అంగన్వాడీల అక్రమ అరెస్టులు ఆపాలి

దళిత ప్రజా సంఘాలు

అంగన్వాడీల ముందస్తు అరెస్టులు నిలిపి వేయాలని, ప్రజాస్వామ్యతంగా ధర్నా చేసేందుకు అవకాశం ఇవ్వాలని దళిత, ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక అన్నే భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో భారతీయ బౌద్ధ మహాసభ ఛైర్మన్ ఆర్.మణిసింగ్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, కెవిపిఎస్, రైతు సంఘం, సిఐటియు నాయకులు ఎ.ఫ్రాన్సిస్, కె.శ్రీనివాస్, కె.విజయలక్ష్మి, ఎం.ఇసాక్, ఐలు నాయకులు కట్టా సత్యనారాయణ, ఎంఆర్‌పిఎస్ నాయకులు మధు తదితరులు పాల్గొని అంగన్వాడీల ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అధికారంలోకి రాకముందు అంగన్వాడీల సమ్మెకు మద్దతు ప్రకటించి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక నిర్బంధం విధించడం సరి కాదని నేతలు అన్నారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించి నిరసన తెలిపే హక్కును కాలరాయవద్దని హితవు పలికారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


మృతదేహానికి నివాళులర్పిస్తున్న నేతలు

సిపిఎం నేత కొండలరావు మృతి

పలువురి సంతాపం


కొండలరావు (ఫైల్)

ప్రజాశక్తి - పెదపాడు

సిపిఎం పెదపాడు గ్రామ నాయకులు, శాఖ సభ్యులు ముసునూరి కొండలరావు (72) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన సిపిఎంలో సుదీర్ఘకాలం పాటు గ్రామస్థాయిలో పని చేశారు. ఆదివారం పెదపాడులోని ఆయన ఇంటి వద్ద భౌతికకాయానికి సిపిఎం జిల్లా, గ్రామ నాయకులు ఎర్రజెండా కప్పి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఆయన మృతికి సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ మాట్లాడుతూ ముసునూరి కొండలరావు సిపిఎం నిర్వహించిన అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని గుర్తు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం కార్యకర్తగా తన వంతు కృషి చేశారని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖా కార్యదర్శి గుండపనేని సురేష్, సిపిఎం నాయకులు షేక్ కరీముల్లా, మేడేపల్లి దాసు, షేక్ షఫీరా, పలువురు సిపిఎం సానుభూతిపరులు పాల్గొన్నారు.

వృద్ధులకు, వితంతువులకు చీరల పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మహిళలకు చీరలు అందిస్తున్న దాతలు

హైదరాబాదుకు చెందిన జీసస్ క్రైస్ట్ ఆఫ్ నజరేత్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు శ్యామ్ కిషోర్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా వంద మందికి పైగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కిచ్చపుగూడెం గ్రామ సర్పంచి సున్నం శాంతకుమారి, గిరిజన నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, కుర్సం మురళి, బసవయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఉద్యోగాల కల్పన కోరుతూ 11న చలో విజయవాడ

యూత్ కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రెటరీ గోళ్ల పవన్‌కుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఉద్యోగాల కల్పన డిమాండ్ చేస్తూ ఈ నెల 11వ తేదీన విజయవాడ నగరంలోని ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు రంగం సిద్ధం చేస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రెటరీ గోళ్ల పవన్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం స్థానిక పాత్రికేయులతో మాట్లాడారు. యూత్ కాంగ్రెస్ నేషనల్ ప్రెసిడెంట్ ఉదయభాను, రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు, యువజన కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మమతా నాగిరెడ్డి ఈ ఆందోళన కార్యక్రమానికి హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మోడీ 11 ఏళ్ల గడిచినా వాటిని విస్మరించడం దారుణమన్నారు. ప్రతి ఏటా డిఎస్‌సి, ఎపిపిఎస్‌సి, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు నిరుద్యోగులకు ఇస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు వాగ్దానాలు చేసి అధికారంలోకి రాగానే ఆ మాటే మరిచిపోయారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాల్సిన పాలకులు సమాజాన్ని పూర్తిగా పక్కదారి పట్టిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించేలా నిరుద్యోగుల సత్తా చాటే విధంగా విజయవాడ నగరంలోని ధర్నా చౌక్ వద్ద ఈ నెల 11వ తేదీన భారీఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజకీయ, వర్గ, కుల, మతాలకు అతీతంగా ప్రతి నిరుద్యోగి పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని గంగవరం గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.ఐదు లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎంపిపి గంజిమాల రామారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి చిన్న తొక్కయ్య, స్థానిక ఎంపిటిసి చింతయ్య, వార్డ్ మెంబర్ రేణుక బాల యేసు, నాయకులు బలే నరేష్, కొయ్యలగూడెం సచివాలయ సోషల్ మీడియా పులపాకుల దుర్గారావు, కొయ్యలగూడెం పంచాయతీ వార్డు మెంబర్ పూలపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అడవిలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు అటవీ ప్రాంతం గోపీనాథపట్నంలో జామాయిల్ తోటలో ఆదివారం చెత్తకు నిప్పంటుకుని అంటుకుని అగ్ని కీలలు వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి ఫైర్ ఇంజిన్ సాయంతో మంటలను అదుపు చేశారు. నిర్లక్ష్యంగా కాల్చి పారేసిన సిగిరెట్ వల్ల మంటలు వ్యాపించి ఉండొచ్చని అధికారులు అంచనా వేశారు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని ఓగిరాలతండా గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య తెలిపారు. నేర స్థలం నుంచి పరారైన మహిళపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కోకో గింజల చోరీపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

కోకో గింజల చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం... జంగారెడ్డిగూడేనికి చెందిన గోరింట రామవర్మకు మండలంలోని సింగరాయపాలెంలో పామాయిల్ కోకో తోట ఉంది. రామవర్మ ఈ నెల ఏడో తేదీ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో రూ.35 వేల విలువైన 175 కేజీల కో కో గింజలు ఆరబెట్టిన తరువాత గుట్టగా పోసి ఇంటికి వెళ్లి ఎనిమిదో తేదీ ఉదయం 7:30 గంటలకు వచ్చాడు. ఆయన వచ్చేసరికి ఆరబెట్టి ఉన్న కోకో గింజలు గుర్తు తెలీని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి...

ప్రజాశక్తి - ముదినేపల్లి

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ ఓ మహిళ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని కొరగంటపాలెం గ్రామానికి చెందిన ఒక మహిళకు 2018లో వివాహమైంది. కొన్ని సంవత్సరాల క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయి మహిళ కోరగంటపాలెం గ్రామంలో తన తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఆమెతో కలిదిండి మండలం పోతుమర్రు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెను శారీరకంగా అనుభవించి మోసం చేశాడు. సదరు వ్యక్తి ఆమెతో తక్కువ కులస్తురాలని, పెళ్లి చేసుకోనని అనగా, సదరు విషయంపై మహిళ గట్టిగా అడగగా అతనితో పాటు అతని కుటుంబ సభ్యులు, మరో ముగ్గురు కొరగుంటపాలెంలోని ఆమె ఇంటికి వచ్చి తక్కువ కులానికి చెందిన నిన్ను ఎలా పెళ్లి చేసుకుంటామని, మా ఇంటికి ఎలా వస్తావని అసభ్యకరంగా బూతులు తిట్టి చంపేస్తామని బెదిరించినట్లు మహిళ ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

'పది' పరీక్షలకు సన్నద్ధం

ప్రజాశక్తి - చింతలపూడి

నాగిరెడ్డిగూడెం పాఠశాలలో అల్పాహారం కోసం ఉన్న విద్యార్థినులు

పదో తరగతిలో కార్పొరేట్ ఫలితాలను తలదన్నేలా ర్యాంకులు సాధించాలని, నూరుశాతం ఉత్తీర్ణతతో పాటు మంచి ర్యాంకులు సాధించాలని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ శిక్షణ ఇస్తున్నారు. అదనపు సమయం కేటాయిస్తూ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. అలాగే చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి తర్ఫీదు ఇస్తున్నారు. కష్టమైన సబ్జెక్టులు సైతం సులువుగా ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు సలహాలు సూచనలు ఇస్తున్నారు. పాఠశాలలో నిర్ణీత సమయం కన్నా అదనంగా సమయం వెచ్చించి వారికి స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి 5:30 గంటల వరకు విద్యార్థులను పాఠశాలల్లో ఉంచి చదివిస్తున్నారు. మామూలుగా ఆరు గంటల సమయం వరకు చదవాల్సి ఉన్నప్పటికీ ఏకంగా తొమ్మిది గంటలకు పైగా పాఠశాల విద్యార్థులు ఉంటున్నారు. దీంతో విద్యార్థులు కొంత ఒత్తిడికి గురవుతున్నప్పటికీ వారి భవిష్యత్తును ఆలోచించి వారికి అదనపు సమయం కేటాయించి చదివిస్తున్నామని మండలంలో పలు ఉపాధ్యాయులు చెబుతున్నారు. విద్యార్థుల ఆరోగ్యం కూడా దృష్టిలో ఉంచుకోవాలని మరికొందరు సూచిస్తున్నారు. దీనికోసం మంచి పౌష్టికాహారం విద్యార్థులకు అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రస్తుతం విద్యార్థుల మధ్యాహ్న భోజనంతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

గతంలో సుమారు 2018 వరకు విద్యార్థులకు అదనపు తరగతులకు జిల్లా పరిషత్ నుంచి అదనపు బడ్జెట్ కేటాయించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నిధులు కేటాయించడం లేదు. సాయంత్రం ఎలాంటి స్నాక్స్ అందించడం లేదు. ప్రస్తుతం విద్యార్థులు సాయంత్రం సమయంలో అలసిపోతున్నారు. అదనపు తరగతుల విషయంలో కొద్దిగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు సరైన చర్యలు చేపట్టకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్నం చేసిన భోజనంతో ఉంటూ ఆకలితో విద్యార్థులు అదనపు తరగతులు అభ్యసించాల్సి వస్తుంది. చింతలపూడి మండలంలో 1250 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షకు సిద్ధమవుతున్నారు. ఎనిమిది సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి 17 నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షలు జరుగనున్నాయి.

స్నాక్స్ అందించండి

హర్ష, పదో తరగతి విద్యార్థి

పదో తరగతి విద్యార్థులకు గతంలో అదనపు స్టడీ అవర్స్ కోసం స్నాక్స్ అందించేవారు. అవకాశం ఉంటే స్టడీ అవర్స్‌లో స్నాక్స్ అందించాలని అధికారులను కోరుతున్నాం.

విద్యార్థులకు అదనపు తరగతులు
వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు

అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం

బాబూరావు, ప్రధానోపాధ్యాయులు, ఎర్రగుంటపల్లి

పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించకపోతే వాటి ప్రభావం పరీక్ష ఫలితాలపై పడుతుంది. ఇంటి వద్ద చదవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత కోసం, ర్యాంకుల కోసం, ప్రత్యేక ప్రణాళికతో ఉపాధ్యాయులతో కలిసి పని చేస్తున్నాం.

అల్పాహారం అందిస్తున్నాం

బ్రాహ్మణేశ్వరమ్మ, నాగిరెడ్డిగూడెం ఎపిఆర్ బాలికల స్కూల్ హెచ్ఎం

విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు అలసటకు, ఒత్తిడికి గురి కాకుండా యోగా చేయిస్తున్నాం. అల్పాహారం అందిస్తున్నాం. ఉత్తమ ర్యాంకులతోపాటు, వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు, తాము కలిసి పని చేస్తున్నాం. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా బోధన జరుగుతుంది. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా యోగా తరగతులు నిర్వహిస్తున్నాం. ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యం.

ప్రణాళిక బద్ధంగా ముందుకు

రామారావు, మండల విద్యాశాఖాధికారి

పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులతో, ప్రధానోపాధ్యాయులతో ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నాం. విద్యార్థులకు అదనపు స్టడీ అవర్స్‌లో స్నాక్స్ పెట్టడానికి నిధులు లేవు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, వారికి తోచినంతగా విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం ఆధ్వర్యాన మహిళా సాంస్కృతిక సమ్మేళనం

వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 20 మందికి అభినందన సత్కారాలు

ప్రజాశక్తి - ఏలూరు

సత్కారం పొందిన మహిళలు

మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారని పలువురు వక్తలు అన్నారు. 1917లో పెట్రోగ్రాడ్ మహిళల ఉద్యమం ప్రేరణతో 1975లో ఐక్యరాజ్యసమితి ప్రకటనతో అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం సంయుక్తంగా సాహిత్యంలో మహిళా సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించాయి. ఈ సందర్భంగా మహిళలకు బెస్ట్ ఫ్రం వేస్ట్, పేపర్ క్రాఫ్ట్, తెలుగు సామెతలు, అంతర్జాలంలో అన్వేషణ అభ్యుదయ మహిళా గీతాలు పోటీలు నిర్వహించగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి అంశంలోనూ బెస్ట్ త్రీ చొప్పున విజేతలకు పెద్దల చేతులమీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సుకు నిర్వాహక కమిటీ సభ్యురాలు టీచర్ జి.నీలిమ స్వాగతం పలికారు. రిటైర్డ్ హెడ్‌మాస్టర్ జి.కస్తూరిబాయ్ అధ్యక్షత వహించారు. రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.ఎస్తేరు కళ్యాణి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఒకరోజు మహిళా దినోత్సవం గురించి చెప్పుకుని సరి పెట్టడం కాకుండా మహిళా సమస్యలపై నిరంతరం చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ డిఎన్ఎస్.చంద్రావతి మాట్లాడుతూ అభివృద్ధి చెందిన శాస్త్రసాంకేతిక రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. హేలాపురి బాలోత్సవం ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళలందరూ తమ శక్తిని అర్థం చేసుకొని అవకాశాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ మహిళలు నిరంతరం ఐక్యం కావాలన్నారు. హెడ్‌మాస్టర్ దేవరకొండ సుశీల మాట్లాడుతూ 1975 నుంచి ప్రతి సంవత్సరం ఐక్యరాజ్యసమితి మహిళా దినోత్సవం ప్రకటిస్తోందని, వాటి వివరాలు తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిలో కమిటీ గుర్తించిన 20 మందికి అభినందన సత్కారాలు చేశారు. సత్కారాలు స్వీకరించిన వారిలో ప్రయివేట్, ప్రభుత్వ స్కూల్స్ టీచర్లు, అంగన్వాడీ ఆశా వర్కర్లు, మీడియా ప్రతినిధులు ఉన్నారు. నిర్వాహక కమిటీ సభ్యులకు, న్యాయ నిర్ణేతలకు మహిళా దినోత్సవ సాహిత్యం రాజ్యాంగ సంకలనం పుస్తకాలు, కందుకూరి వీరేశలింగం జీవిత చరిత్రబుక్స్, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో టీచర్ ఎం.సుకన్య, మానవత ఏలూరు మండల కార్యదర్శి వి.సాయిసుధ, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ వై.నిర్మల, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు కె.శ్రీనివాసరావు, కె.శ్రావణి కుమారి, కె.జనని, నెరసు నాగమణి పాల్గొన్నారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నుంచి యధాతథంగా నిర్వహిస్తామని జిల్లా ఎస్‌పి ప్రతాప్‌శికిషోర్ స్పష్టం చేశారు. ఉభయగోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో గత 30 రోజులుగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలు పూర్తిగా నిలిపివేశారు. ఎన్నికల ప్రక్రియ, కౌంటింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో ఈ సోమవారం నుంచి తిరిగి పోలీస్ గ్రీవెన్స్‌ను తిరిగి ప్రారంభించేందుకు పోలీసు శాఖ సమాయత్తమైంది. ఈ మేరకు ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ఆదివారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. పోలీసు శాఖలో పరిష్కారం కాని ఫిర్యాదులను సోమవారం నుంచి ఎస్‌పి కార్యాలయంలో ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.

12న చేగొండపల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని చేగొండపల్లి గ్రామంలో మార్చి 12వ తేదీ బుధవారం ఐటిడిఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఒఎన్‌జిసి సౌజన్యంతో రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయ నేత్ర వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రచార రథాన్ని ఎపి ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆదివారం పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో గిరిజనుల నేత్ర సంబంధ ఇతర జనరల్ వైద్యాలు ఉచితంగా అందిస్తూ గిరిజనుల అభ్యున్నతికి తోడ్పడుతున్న ఐటిడిఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనిల్‌కుమార్, టిడిపి మండలాధ్యక్షులు బొడ్డు కృష్ణ, పట్టిసీమ, ప్రగడపల్లి, చేగొండపల్లి గ్రామాల సర్పంచులు సబ్బారపు శ్రీరామ్మూర్తిచ, కలుం బాపిరాజు, జారం సీతారామలక్ష్మి, ఎస్‌టియు యూనియన్ నాయకులు పాతకోట పోసిరావు, నియోజకవర్గ నాయకులు కాటాల వెంకటేశ్వరరావు, ఐటిడిఎస్ ప్రతినిధులు గంగు రామలక్ష్మి, ఎం.ఫిలోమిన్, ఆప్తమిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ ముచ్చిక రంజిత్ కుమార్ దొర, వెట్టి నాగేశ్వరరావు, ముచ్చిక శివ, మడకం రామారావు, బొరగం బుల్లిదొర, చోడే గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సమస్యలపై 12న మహాధర్నా

ప్రజాశక్తి - కలిదిండి

ఉపాధి హామీ సమస్యలపై మార్చి 12వ తేదీన తలపెట్టిన చలో విజయవాడ ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని భాస్కరరావుపేట, మూలలంక గ్రామాల్లో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని, వంద రోజుల పనిదినాలు పూర్తైన ఉపాధి కూలీలకు అదనంగా పనులు కల్పించాలని, సమ్మర్ అలవెన్స్, పే స్లిప్పులు ఇవ్వాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, ప్రమాదాల్లో చనిపోయిన వలస కార్మికులకు రూ.25 లక్షలు ఇవ్వాలనే తదితర సమస్యల పరిష్కారానికి ఈ నెల 12న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామీణ కూలీలు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున కలిసి, కదలి రావాలని వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.మహాలక్ష్మి, బి.కుమారి, పి.లక్ష్మి, పి.నాగలక్ష్మి, జి.కనకదుర్గ పాల్గొన్నారు.

నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ జిల్లా ఇన్‌ఛార్జిగా చిన్ని

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఇన్‌ఛార్జి అధ్యక్షులుగా నూజివీడుకు చెందిన యర్రంశెట్టి చిన్ని నియమితులయ్యారు. ఆదివారం నూజవీడులో జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నవ్యాంధ్ర అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ సుభాని ఈ నియమకాన్ని ప్రకటించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుభాని మాట్లాడుతూ సంఘం బలపడితేనే హక్కుల సాధనకు అవకాశం ఉంటుందన్నారు. పని ఉంటేనే పూట గడవని పరిస్థితిలో మెకానిక్‌లు ఉన్నారని, వారికి ఆర్థిక, శారీరక ఇబ్బందులు ఏర్పడితే అసోసియేషన్ అండగా నిలబడుతుందన్నారు. ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్న సీనియర్ మెకానిక్ బసవయ్య, ప్రమాదానికి గురైన సుబ్బారాయుడులకు అసోసియేషన్ తరపున రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సమావేశంలో అతిథులను నూజివీడు అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. సీనియర్ జర్నలిస్ట్ రాజశేఖర్ సభను నిర్వహించారు. అసోసియేషన్ అనుబంధ విభాగమైన నిజనిర్ధారణ కమిటీ సభ్యులుగా షేక్ సుభాని, పి.కిషోర్, త్రిమూర్తులను నియమించారు.

ఓపెన్ అయిన వితంతు పెన్షన్ స్పౌజ్ ఆప్షన్

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో లేక అంతకుముందు భర్త చనిపోతే భార్యకు ఇచ్చే స్పౌజ్ పెన్షన్‌కు ఆప్షన్ ఓపెన్ అయిందని మండల అధికారులు తెలిపారు. చనిపోయిన వారి డెత్ సర్టిఫికెట్, భార్య ఆధార్ కార్డ్ జిరాక్స్‌తో గ్రామ వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్ అధికారులను సంప్రదించాలని, వచ్చే నెల నుంచి రూ.నాలుగు వేల పెన్షన్ అందుతుందని అధికారులు తెలిపారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

అంగన్వాడీ సమ్మె డిమాండ్లను పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని 42 రోజుల పాటు సమ్మె చేస్తుండగా టిడిపి నాయకులు సమ్మె శిబిరాలకు వచ్చి అంగన్వాడీలకు అనేక వాగ్దానాలు చేశారని తెలిపారు. ఇప్పుడు వారే అధికారంలో ఉన్నారని, తొమ్మిది నెలలుగా అనేక సార్లు వారిని కలిసి వినతిపత్రాలు ఇచ్చినా కనీసం స్పందన లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మార్చి పదో తేదీన విజయవాడలో ధర్నాకు అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపునిస్తే ఎవరూ పాల్గొనకుండా అడుగడుగున అంగన్వాడీలను, సిఐటియు నాయకులను నిర్బంధాలకు గురి చేయడం దుర్మార్గమని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

500 మందికి ఉచితంగా మందులు

నూజివీడు టౌన్ :పట్టణంలోని విక్టోరియా పుర మందిరం ఆవరణలో ద్వారావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. నూజివీడు పట్టణ పరిసర ప్రాంతాల్లో మందులు కూడా కొనుక్కోలేని నిరుపేద కుటుంబాల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 18 మంది వివిధ డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన నైపుణ్యం కలిగిన డాక్టర్లతో పరీక్షలు నిర్వహించారు. సుమారు 500 మంది ఈ వైద్య శిబిరానికి వచ్చి వారికి అవసరమైన మందులను ఉచితంగా పొందారు. శిబిరానికి ద్వారావతి ఫౌండేషన్ దాతలు, సేవకులు, నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆత్మకూరు విద్యార్థులు సహకారాలను అందించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య

చింతలపూడి:పామాయిల్ సాగు చేస్తున్న కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలోని రాధా గార్డెన్స్‌లో పామాయిల్ కౌలు రైతుల సమావేశం కుప్పాల సురేష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ పామాయిల్ సాగులో 90 శాతం మంది కౌలు రైతులు ఉన్నారని, వీరిని గుర్తించి వీరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. వీరు పండించిన పంటను కంపెనీకి అమ్మగా వారంరోజులు తర్వాత కంపెనీ డబ్బులు ఖాతాలో జమ చేస్తుందని, దీంతో ఇబ్బంది పడుతున్న కౌలు రైతులు దళారులను ఆశ్రయించి టన్నుకు 500 తగ్గించి అమ్ముకుంటున్నారన్నారు. దీంతో కౌలు రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. కౌలు రైతులు అమ్మిన వెంటనే కంపెనీ వారు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లూరి సోమశేఖర్, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ, ఏలూరు

ROC.No.257888/2025/A1 **బహిరంగ వేలము నోటీసు** Dt.01.03.2025

ఏలూరు నగరపాలక సంస్థ ఆధీనములో గల మేకల కటేళ యందు 2025-2026 సంవత్సరమునకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ నెం.1 **తేది.20.2.2025** నందలి నిబంధనలు ప్రకారము **ది.01.04.2025 నుండి ది.31.03.2026 వరకు** గల 12 నెలల కాలమునకు గాను మేకల కటేళ గుత్తహక్కు లీజుకిచ్చుటకు **ది.21.03.2025 శుక్రవారం ఉదయం గం.11.00 లకు** బహిరంగల వేలము నిర్వహించబడును. బహిరంగ వేలములో పాల్గొనదలచిన వారు బహిరంగ వేలములో పాల్గొనుటకు కావలసిన ధృవ పత్రములు అన్నియు ఏలూరు నగరపాలక సంస్థ రెవెన్యు విభాగము నందు **ది.20.03.2025 సాయంత్రం 5.00 గంటల** లోపు దాఖలు పర్చవలెను. పాటపాడదలచిన వారు బహిరంగ వేలమునకు సంబంధించిన షరతులను ఆఫీసు పనివేళలలో రెవెన్యూ విభాగము వారి నుండి పొందగలరు. ఇతర వివరములకు ఆఫీసు పనిచేయువేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.

సంప్రదించవలసిన ఫోన్ నెం.9849907144, 7013187783, 9492974794.

సం/- కమీషనర్,
నగరపాలక సంస్థ, ఏలూరు.

నాణ్యమైన విద్య అందించేందుకు కృషి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన విద్యా విధానాన్ని ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన తరహాలో రూపొందిస్తుందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఆయన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల విద్యా శాఖధికారులకు ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన జిఒ 117ను రద్దు చేసి గ్రామపంచాయతీల్లో మోడల్ స్కూళ్లు ఏర్పాటు చేయడం ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మోడల్ స్కూల్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో పిల్లలు దగ్గర్లో స్కూళ్లకు వెళ్లడానికి ప్రతి విద్యార్థికి రూ.ఆరు వేలు ప్రయాణం ఖర్చు ఇచ్చేలా ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందన్నారు. ప్రజలు కూడా ఈ నూతన విద్యా విధానాన్ని స్వాగతించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా విద్యాశాఖాధికారులను వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన సత్తినేని కృష్ణకాంత్, తండ్రి: త్రిమూర్తులు అను నేను గ్రామంలో ఇంటి నుండి **పాస్‌పోర్ట్ నెం. Z7247410** గల పాస్‌పోర్ట్ తీసుకుని ద్విచక్ర వాహనంపై మొగల్తూరు వెళుతూ ఉండగా మార్గమధ్యంలో నా పాస్‌పోర్ట్ జారి పడిపోయింది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలుపగలరు.

సత్తినేని కృష్ణకాంత్
S/o. త్రిమూర్తులు,
మొగల్తూరు మండలం, పేరుపాలెం సౌత్,
మోగదారమ్మ గుడి వద్ద,
పిన్ కోడ్ : 534281
సెల్: 94411 71757

మహారాజశ్రీ ఏలూరు అడిషనల్ జడ్జి (సీనియర్ డివిజన్)వారి కోర్టు

E A.337/24 in EA.4/2022 in OS.271/16

Between :
somisetty srinivasulu ...DHR
vs
yanamandra Durga prasad(died) and others ...Jdrs/ loop Proposed parties

To,
1.Yanamandra to srirama Lakshmi
w/o Durga Prasad.
2.yanamandra vishunuviswa Teja
S/o Durga Prasad
3.yanamandraL.R Vishnavi
D/o.Durga Prasad
Near santhi convent
Kammavari street , Bhimadole, Bhimjcj.

ఇందుమూలంగా తెలియ జేయనది ఏమనగా పై కోర్టనందు మీ మ్ములను చని పోయిన Y.దుర్గ ప్రసాద్ తరపున వారసులుగా చేర్చమని కోరుచు పిటిషనర్ పిటిషన్ దాఖలు చేసినారు. కావునా మీరు **ది.13.3.2025**వ తేదిన పై కోర్టులో ఉదయం గం10.30 ని॥ల మీరు స్వయంగా గానీ వకీల్ ద్వార గానీ హాజరు అయి, మీకుగల అక్షేపన్లను తెలియపర్చేది. లేని యెడల మీ పరోక్షంలో సదరు పిటిషన్ విచారించబడునని తెలుసుకునేది.

V.జ్యోత్స్న
తేది.08.03.25 పిటిషనర్/డిహెచ్ఆర్ ఏలూరు.

మహారాజశ్రీ తణుకు నాల్గవ జిల్లా జడ్జి వారి కోర్టులో

G.W.O.P.No. 19/2024

Between:
అందే వరలక్ష్మి ...**పిటిషనరు**
మరియు
అందే నాగబాబు ...**రెస్పాండెంటు**

పిటిషనరు తరుపున చేసిన ప్రకటన

పై నెంబరు గ్రంధములో పిటిషనరు రెస్పాండెంట్లు మైనరు కుమార్తె అయిన అందే హర్షిణి సాయి (7సం॥ పుట్టిన తేది. 01-05-2017) మైనరు కుమారుడు అందే హేమన్స్ సాయి (4సం॥ పుట్టిన తేది. 21-07-2020) లను రెస్పాండెంటు కస్టడి నుండి నేచురల్ గార్డియన్ తల్లి అయిన పిటిషనరుకు కస్టడి ఇప్పించవలసినదిగా కోరుచూ పిటిషనరు పై కోర్టు నందు గార్డియన్ O.P No. 19/2024 పిటిషను దాఖలు చేయించుకొనియున్నది. సదరు O.P పై కోర్టు నందు **ది. 27-03-2025 తేదినకు** వాయిదా ఉన్నది. అందు విషయమై దగ్గరి బంధువులకు గాని, మరెవ్వరికైనా ఎట్టి అభ్యంతరములు ఉన్న ఎడల **ది. 27-03-2025 తేదిన ఉదయం 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలసినదిగా యి పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

నీలం హరీష్ నాయుడు
తణుకు పిటిషనరు తరుపు అడ్వకేట్
ది. 09-03-2025 తణుకు
సెల్ నెం: 92932 22187

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) KOVVUR

O.S.No.295/2023

మాస్టర్ చిరుకూరి మెహన్ సాయి దర్మతేజ ...**వాది**
(Being minor rep by his next friend/guardian and mother Smt Chirukuri@Atkuri Pavani)
మరియు
చిరుకూరి ధర్మేంద్ర మూర్తి వగైరా ...**ప్రతివాదులు**

To:-
4వ ప్రతివాది:- తోటకూర శ్రీనివాసరావు,తండ్రి అచ్చుత రామారావు, వయస్సు 38, వ్యవసాయం, వింజరం, కుకునూరు మండలం, ఏలూరు జిల్లా సెల్ నెం. 7799446615

పై నెంబరు దావాలో దావా సంగతులు తెలియజేయు నిమిత్తం 4వ ప్రతివాదికు కోర్టు ద్వారాను మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారాను ఎన్ని పర్యాయాలు దావా సమన్లు పంపినప్పటికి సదరు 4వ ప్రతివాది బుద్ధి పూర్వకముగా Avoid చేయుచున్న కారణంగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా దావా సంగతులు తెలియజేయడమైనది. పై నెంబరు దావాలో మీకు ఏవైనా అభ్యంతరములు వున్న యెడల **ది.20-03-2025**వ తేదిన ఉదయం **10.30**ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైన ఆక్షేపణలు వున్న యెడల తెలియపర్చుకోవచును. లేనియెడల వారి పరోక్షమున తీర్మానించడమగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా : 20-03-2025

అత్మూరి సత్యనారాయణ
వాది తరపు అడ్వకేట్
కొవ్వూరు కొవ్వూరు, తూ॥గో॥జిల్లా
ది.27-02-2024 సెల్.984984197